క్లుప్తంగా

పంట రుణాలు మాఫీ చేయాలి



జెండాను ఆవిష్కరిస్తున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులు పడుతున్న రైతన్నలను ఆదుకోవడానికి రూ.2 లక్షల వరకు పంటరుణాలు మాఫీచేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఆర్ భవన్‌లో రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేశారని, ఇక్కడ కూడా అదే మాదిరిగా రుణాలను మాఫీ చేయాలని కోరారు. నాయకులు పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, సి.మహేష్, సురేంద్రయాదవ్, సోమన్న, బీసన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

శాంతిని నెలకొల్పాలి



సుందరయ్య సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ దేశాలు కలుగజేసుకొని పాలస్తీనా, ఇజ్రాయెల్‌లో యుద్ధం విరమింపజేసి, శాంతిని నెలకొల్పాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల కోరారు. ఆదివారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీల ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్, పాతబస్తీలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమెరికా యుద్ధోన్మాదంతో పాలస్తీనా, ఇజ్రాయెల్‌లో నిత్యం యుద్ధం జరుగుతోదన్నారు. అమెరికా ఇజ్రాయెల్‌కు ఆయుధాలను సరఫరా చేస్తుండడంతో దాదాపు 40 వేల మంది పాలస్తీనా పౌరులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ఆడుతున్న నాటకంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ చేరారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రభాకర్, టి.రాముడు, అబ్దుల్‌దేశాయ్, రాజగోపాల్, వి.సుబ్బయ్య పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత చిట్యాల



చిట్యాల జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో చిట్యాల జట్టు విజేతగా నిలిచినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం జరిగిన పోటీల్లో కోడుమూరు మండలం వల్కూరు జట్టుపై చిట్యాల జట్టు గెలుపొందింది. మూడవస్థానంలో తుగ్గలి మండలం నునసరాళ్ల, నాల్గవస్థానంలో ప్యాపిలి మండలం బావిపల్లి జట్లు నిలిచాయని నిర్వాహకులు సురేష్, హరికృష్ణ తెలిపారు. విజేతలకు దాతలు తాడూరు రామాంజనేయులు, వైస్ సర్పంచ్ వెంకటరాముడు, తాడూరు బాలన్న, గ్రామ యూత్ సభ్యులు వరుసగా రూ.10వేలు, రూ.7 వేలు, రూ.4వేలు, రూ.2వేలను అందజేశారు. పోటీల్లో జిల్లాలోని 25 జట్లు పాల్గొన్నాయి.

డి.బెళగల్‌లో రాష్ట్రస్థాయి ల్యాక్రోస్ క్రీడలు



ల్యాక్రోస్ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి కీర్తిని సన్మానిస్తున్న దృశ్యం

కోసిగి: జిల్లాలో మారుమూల ప్రాంతం డి.బెళగల్ గ్రామీణ ప్రాంతంలో రాష్ట్ర స్థాయి ల్యాక్రోస్ క్రీడలు నిర్వహించడం అభినందనీయమని, ఏపీ రాష్ట్ర ల్యాక్రోస్ క్రీడల అసోసియేషన్ అధ్యక్షుడు మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సురేంద్ర రెడ్డి, కోసిగి హైస్కూల్ హెచ్ఎం, పీడీ ఖలీల్ అహ్మద్ అన్నారు. ఆదివారం కోసిగి మండలం డి.బెళగల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏపీ ల్యాక్రోస్ క్రీడల అసోషియేషన్ ఆధ్వర్యంలో డి.బెళగల్ విజేత యూత్ సమక్షంలో రాష్ట్ర స్థాయి అండర్-17 ల్యాక్రోస్ క్రీడలు ప్రారంభమయ్యాయి. క్రీడలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయి ల్యాక్రోస్ క్రీడల్లో పాల్గొన్న కర్నూలు జిల్లా కులుమాల గ్రామానికి చెందిన కీర్తి అనే ఇంటర్మీడియెట్ విద్యార్థినిని శాలువా, మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామయ్య, యూత్ అసోషియేషన్ సభ్యులు నాగరాజు, సల్మాన్‌రాజు, ఉసేని, ఎస్ఎంసీ చైర్మన్‌లు తిక్కయ్య, వీరనాగప్ప, సిద్దప్ప గౌడ్, ప్రభాకర్ గౌడ్, పాండురంగ, రంగారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాల సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ ఇక్రముల్లా సూచించారు. ఆదివారం సాయంత్రం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇక్రముల్లా మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, వాటి ప్రభావం మెదడు, మనిషి ప్రవర్తనపై ఎలా ఉంటుంది, శారీరకంగా ఆరోగ్యం ఎలా దెబ్బతింటుంది, కెరీర్ (భవిష్యత్) ఎలా నాశనం అవుతుంది, మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డ వారిని ఆ వ్యసనానికి ఎలా దూరం చేయాలని, ఏ విధమైన చికిత్స అందించాలనే విషయాలను కూలంకుశంగా వివరించారు. అన్ని ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారికి ఉచితంగా చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ఇక్కడ చేరి వైద్యులు సూచించిన చికిత్సను తీసుకుంటూ కౌన్సెలింగ్ అందుకుంటూ భవిష్యత్‌ను మెరుగుదిద్దుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే విలువైన భవిష్యత్ నాశనం అవుతుందని, ఆరోగ్యం సైతం తీవ్రంగా దెబ్బతింటుందని చెప్పారు. సమాజంలో ఆ వ్యక్తికి విలువ లేకుండా పోతుందని, ఈ ఒక్క వ్యసనం వల్ల అన్నీ కోల్పోవాల్సి వస్తుందని, కావున ప్రతిఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సమాజంలో చాలా మంది మద్యం, గుట్కా వంటి వ్యసనాలతో పాటు గంజాయి, డ్రగ్స్‌కు సైతం అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల వారితో పాటు వారి కుటుంబాలు కూడా రోడ్డున పడతాయన్నారు. చిన్న వయస్సులోనే వీటికి అలవాటు పడితే ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని, స్పృహలేని పరిస్థితిలో వారు ఏమి చేస్తున్నారో అర్థంకాదని, తద్వారా కుటుంబానికి, సమాజానికి దూరంగా బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జీవితాలను నాశనం చేసే ఇలాంటి అలవాట్లకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ ఇక్రముల్లాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, ట్రెజరర్ కేపీ రాముడు, సభ్యులు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ఇక్రముల్లాను సన్మానిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

10న వర్ధంతి సభ

కర్నూలు(సెంట్రల్): వీరనారి చాకలి ఐలమ్మ, సత్తెనపల్లె రామకృష్ణ వర్ధంతి కార్యాక్రమాన్ని సెప్టెంబర్ 10వ తేదీన నిర్వహించనున్నట్లు ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ తెలిపారు. ఆదివారం ఏపీ రజక వృత్తిదారుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శేషాద్రి, రాముడు, జయమ్మ పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్య లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): భారీ వర్షాల నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఎలక్ట్రికల్ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి విద్యుత్ సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది, అత్యవసర విభాగాలైన క్యాజువాలిటీ, గైనిక్, పీడియాట్రిక్ విభాగాల వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రి పవర్‌స్టేషన్‌ను సందర్శించిన అనంతరం పవర్‌స్టేషన్, జనరేటర్స్‌లో డీజిల్ గురించి ఆరా తీశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ సిబ్బందిని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఎలక్ట్రికల్ సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యులు అప్రమత్తంగా ఉండి వైద్య సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నగర బ్రాహ్మణ సంఘానికి త్వరలో ఎన్నికలు



సమావేశానికి హాజరైన బ్రాహ్మణులు

కర్నూలు(అర్బన్): నగర బ్రాహ్మణ సంఘానికి త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు తీర్మానించినట్లు సంఘం నాయకులు చల్లా నాగరాజ శర్మ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక సంకల్‌బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు, కల్లూరు ప్రాంతాలకు చెందిన బ్రహ్మణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగరాజ శర్మ మాట్లాడుతూ.. అందరి అభిప్రాయం మేరకు పాత కమిటీని రద్దు చేస్తూ కొత్త కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల అధికారిగా డీవీఆర్ శర్మ పేరును ప్రతిపాదించినట్లు చెప్పారు. ప్రతి సభ్యుడు రూ.216 సభ్యత్వ రుసుము చెల్లించాలన్నారు. ప్రతి సభ్యునికి గుర్తింపు కార్డు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే భగవంతుని సేవకు ఎలాంటి అడ్డంకులు లేకుండా దేవాలయ ధూపదీప నైవేద్యాలు, పూజార్ల జీతభత్యాలను ఎన్నికల అధికారి చూసుకునే విధంగా తీర్మానించినట్లు చెప్పారు. సమావేశంలో చేసిన తీర్మానాలను హాజరైన బ్రహ్మణులందరూ ఆమోదించినట్లు ఆయన వెల్లడించారు.

వర్షాకాలంలో ఆరోగ్యం జాగ్రత్త



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): వర్షాలు అధికంగా కురుస్తున్నందున ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కాచి వడపోసిన నీటిని తాగాలని, వేడివేడి ఆహారం తీసుకోవాలన్నారు. వండిన ఆహారంపై మూతలు ఉంచాలని, ఈగలు, దోమలు రాకుండా ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు గర్భిణిలు, బాలింతలు వానలో తడవరాదన్నారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, టెంకాయ చిప్పలు, పాత వాటర్ బాటిళ్లు, పాత రోళ్లు, నిరుపయోగంగా ఉన్న పాత్రల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మురుగు గుంటలపై గ్రామ కార్యదర్శి/సర్పంచ్/సంబంధిత వార్డు మెంబర్లకు తెలిపి శుభ్రం చేయించాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వేపాకుతో పొగ వేసుకోవడం వల్ల దోమల నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. నిద్రించేటప్పుడు దోమతెరలు వాడాలని ఎవరికైనా జ్వరం, వాంతులు, విరేచనాలు, ఏ ఇతర సమస్య వచ్చినా స్థానికంగా ఉన్న ఆశా, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా దగ్గరలోని ప్రభుత్వం వైద్యశాలలో చికిత్స పొందాలని సూచించారు.

యువత పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): యువతీ, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై డీవైఎఫ్ఐ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో డీవైఎఫ్ఐ కర్నూలు నగర ఓల్డ్ సిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నివారణపై యువతను మేలుకొల్పాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో డీవైఎఫ్ఐ ఓల్డ్ సిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నాయుడు, అంజి, ఉపాధ్యక్షులుగా షేక్ అహ్మద్, మణికంఠ, అమర్, సహాయ కార్యదర్శిగా చంద్రతోపాటు మరో 24 మందిని కమిటీ సభ్యులగా ఎన్నుకున్నారు. సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు హుస్సేన్‌బాషా, రంగప్ప పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

కర్నూలు (టౌన్): విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని వీఆర్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సి.వాసురెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న పార్కులో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు ఆయన బెల్టులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న క్రీడాంశంలో ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో జీవిస్తున్న చిన్నారులకు నేస్తం జిల్లా స్థాయి పాజిటివ్ నెట్‌వర్క్‌లోని కేర్ సపోర్ట్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక బుధవారపేటలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ(నంద్యాల) ప్రెసిడెంట్ వి.విజయభాస్కర్, జి.వరలక్ష్మి సహకారం అందించారు. ముఖ్యఅతిథి డాక్టర్ ఎం.సుబ్బరాయుడు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఎంఅండ్‌ఈ జె.దేవీశంకర్‌గౌడ, నేస్తం సంస్థ అధ్యక్షులు బి.సుధారాణి, వైఆర్‌జీ కేర్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. ఆదోని పట్టణ వాస్తవ్యులు కమలాపురం మంజులదేవి, మోహన్‌కృష్ణ వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116 దేవాలయ కార్యాలయంలో అందజేశారన్నారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు.

ఆవును కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న ఆవును అగ్నిమాపక శాఖ సిబ్బంది కాపాడారు. స్థానిక లక్ష్మీనగర్ బార్ సమీపంలోని కేసీ కెనాల్‌లో ఆదివారం రాత్రి ఆవు కొట్టుకుపోతుండటాన్ని స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖకు ఫోన్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఆ శాఖ సిబ్బంది కేసీ కెనాల్‌లో దూకి ఆవును ఒడ్డుకు చేర్చారు. వారు చేసిన మేలును స్థానికులు అభినందించారు.

కుల వివక్షతోనే డీఏహెచ్‌ఓపై దాడి



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డు ప్రసాద్

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గోవింద్‌నాయక్‌పై కుల వివక్షతో డిపార్టుమెంటు ఉద్యోగులే దాడి చేసి ఆయన ఆత్మాభిమాన్ని దెబ్బతీయడం దారుణమైన విషయమని పశుసంవర్ధక శాఖ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్లు సీహెచ్ కృష్ణారావు, బొడ్డుప్రసాద్ వాపోయారు. నంద్యాల డీఏహెచ్‌ఓపై జరిగిన దాడిని ఉమ్మడి జిల్లా పశుసంవర్ధక శాఖ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం ఆదివారం రైల్వేస్టేషన్ సమీపంలోని హోటల్‌లో సమావేశం నిర్వహించి తీవ్రంగా ఖండించింది. ఈ సమావేశానికి హాజరైన అధికారులు మాట్లాడుతూ.. అధికారిపై దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంటనే విచారణ కమిటీని నియమించి సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. కులవివక్షతకు గురైన డీఏహెచ్‌ఓకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. నీతి, నిజాయితీతో పనిచేస్తున్న నంద్యాల డీఏహెచ్‌ఓపై నిరాధార ఆరోపణలు చేయడం, అగ్రవర్ణ ఉద్యోగులు దాడికి పాల్పడడం సహించరాని విషయమన్నారు. డాక్టర్ గోవింద్‌నాయక్‌పై కుల వివక్షను ఆపకపోతే అన్ని శాఖల ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. అధికారులు రవిబాబు, కమలాకర్, ప్రవీణ్, శ్రీనివాసులు,మనోజ్, కిశోర్, దినకర్, వికాస్, భువన, శ్రుతకృర్తి, పలువురు ఏడీలు, వీఏఎస్‌లు తదితరులు పాల్గొని డీఏహెచ్‌వోకు సంఘీభావం ప్రకటించారు.

ఊపిరితిత్తుల సమస్యలకు అత్యాధునిక చికిత్స



సదస్సుకు హాజరైన వైద్యనిపుణులు

కర్నూలు(హాస్పిటల్): ఊపిరితిత్తుల సమస్యలకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని వైద్య ప్రముఖులు చెప్పారు. ఆదివారం కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో లంగ్స్ అటాక్ పేరుతో కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) నిర్వహించారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రి, కర్నూలు కిమ్స్ ఆసుపత్రుల సహకారంతో కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఊపిరితిత్తుల సమస్యలకు చికిత్స, అత్యాధునిక వైద్య విధానాలు, మందులు, వాటితో రోగులకు ఎలా ఊరట లభిస్తుందన్న విషయాలను వివరించారు. కర్నూలు కిమ్స్ నుంచి డాక్టర్ జి.సుధాకర్, వెంకటచలమయ్య, కొండాపూర్ కిమ్స్ - శుభకర్ నాదెళ్ల, అనంతపురం ఆస్పత్రి నుంచి డాక్టర్ యశోవర్ధన్ నిర్వాహకులుగా వ్యవహరించారు. కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, అనంతపురం, బళ్లారి, రాయచూరు, హైదరాబాద్, మేడ్చల్ తదితర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులు హాజరై 150 మంది జూనియర్ వైద్యులు, పీజీ విద్యార్థులకు చికిత్సా పద్ధతులపై అవగాహన కల్పించారు. కర్నూలు కిమ్స్ సీఓఓ డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులను ఏటా నిర్వహిస్తామని చెప్పారు. టీబీ గుర్తింపు, సత్వర చికిత్స, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ లాంటి సమస్యలకు చికిత్సా విధానాన్ని వివరించారు. ఐఎంఏ కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ రామచంద్రనాయుడు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, ట్రెజరర్ డాక్టర్ కె.మాధవీశ్యామల, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, డాక్టర్ జి.శారద పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు



సందేశమిస్తున్న వైష్ణోకృప చైతన్య ప్రభు

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సుకు కంకణబద్దులు కావాలని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సూచించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహారాజ భోగ నివేదన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ధాతృత్వ గుణం పెరుగుతుందన్నారు. భారత భాగవతంను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఈ గ్రంథాలు మానవ మనుగడకు మార్గదర్శకాలు అని వివరించారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి.కృష్ణారెడ్డి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీము (సీపీఎస్)ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రెండు దశాబ్దాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాల్లో చీకటి నింపిన సీపీఎస్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలను విరమించుకొని ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. జీపీఎస్, యూపీఎస్ ప్రత్యామ్నాయ విధానాలు ఓపీఎస్‌కు ఏ మాత్రం సరిరావన్నారు. యూపీఎస్ వల్ల ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఓపీఎస్‌ను అమలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. పీఆర్‌టీయూ నాయకులు రామకృష్ణ, నాగేశ్వరయ్య, ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాసులు, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై విచారణ చేయాలి



సుందరయ్య సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో మహిళల వాష్ రూమ్‌ల్లో రహస్య కెమెరాలు అమర్చిన సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు అబ్దుల్లా, నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య సర్కిల్‌లో గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర విచారణ కోసం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఘటనపై నిష్పాక్షపాత విచారణ చేసి నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్): కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రావణి, గిడ్డమ్మ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు రక్షణ లేకుండా పోతోందని, చివరకు చదువుకునే కళాశాలలు, పాఠశాలల్లోనూ యువతులు, బాలికలకు రక్షణ లేకపోతే ఎలా అని, రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. కాలేజీ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీడని ముసురు

నగరంలో ఆదివారం ఉదయం నుంచి ముసురుకుని తేలికపాటి జల్లులు కురిశాయి. రహదారులు చిత్తడిగా మారాయి. వానకు తోడు చల్లటి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వ్యాపారులు వర్షంలోనే తడుస్తూ తమ వ్యాపారాలు సాగించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



నగరంలో కురుస్తున్న వర్షం



వర్షంలో దూసుకెళ్తున్న ద్విచక్ర వాహనదారులు



మొక్కజొన్న పొత్తులను విక్రయిస్తున్న దృశ్యం